
లక్ష్మాపురంలో డ్రోన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

## రైతులు ఆధునిక పద్ధతులు అవలంబించాలి

• నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, జూలై 9 : రైతులు పంటల సాగులో ఆధునిక పద్ధతులను వినియోగించుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని లక్ష్మాపురం గ్రామంలో మంగినపల్లి నర్సిరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో పంటలపై రసాయన మందులను పిచికారీ చేసే డ్రోన్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు అధునిక పద్ధతులు పాటించడం వల్ల సమయం, పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. రైతులు సాంకేతికతను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణయ్య, గుత్తా నర్సిరెడ్డి, గోదాసు పృథ్వీ, ఎండీ రేహాన్, ప్రకాశ్, అక్రం, శివనారాయణ, లింగం పాల్గొన్నారు.

## అభయ హస్తం హామీలు అమలు చేయాలి

• మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆంజనేయులు, నర్సింహ


సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ ఆంజనేయులు

భువనగిరి అర్బన్, జూలై 9 : కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన అభయ హస్తం హామీలను అమలు చేయాలని మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎన్నబోయిన ఆంజనేయులు, పెంట నర్సింహ కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ- డీ నుంచి బీసీ- ఏకు మార్చాలని, ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయాలని అన్నారు. చెరువులు, కుంటలపై ముదిరాజ్, బెస్తలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం తేవాలని కోరారు. మత్స్యకారుల అభివృద్ధికి వివిధ పథకాల కింద 75శాతం సబ్సిడీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఈ నెల 15 నుంచి 20 వరకు అన్ని మండల కేంద్రాల్లో రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు పల్లెపాటి బాలయ్య, ఇట్టబోయిన గోపాల్, ఎన్నబోయిన జహంగీర్, ఉడుత భాస్కర్, వెంకటేశ్, కృష్ణ, నాగేశ్, సాయి, పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ రాజాపేట మండలాధ్యక్షుడిగా తిరుమలేశ్



రాజాపేట, జూలై 9 : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా సట్టు తిరుమలేశ్‌ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా తిరుమలేశ్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన ఎంపికకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి : బీఆర్ఎస్


సమావేశంలో మాట్లాడుతున్న భిక్షం

ఆత్మకూరు(ఎం), జూలై 9 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ దుప్పల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బాలగోని భిక్షం అన్నారు. గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గెలిచిన నెల రోజుల్లో దుప్పల్లిలో సీసీ రోడ్లు, మోత్కూర్ - తొర్రూర్ ప్రధాన రోడ్డు నుంచి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపడుతామని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు వాగ్దానం చేశారన్నారు. అధికారంలోకి వచ్చి 6నెలలు గడుస్తున్నా ఏ ఒక్కటీ చేపట్టలేదని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుంటే ఆందోళన చేపడుతామన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కట్టెల నర్సయ్య, నాయకులు నీల రవి, మణిమద్దె రాములు, మత్స్యగిరి, వెంకన్న, రాజేశ్వర్, నర్సయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పోస్టులు పెంచాలి : డీవైఎఫ్ఐ


ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

చౌటుప్పల్, జూలై 9 : ఉపాధ్యాయుల పోస్టులు పెంచి డీఎస్సీ నిర్వహించడంతోపాటు గ్రూప్-2 పరీక్షల గడువును పొడిగించాలని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలు ఖర్చు పెట్టి కోచింగ్ సెంటర్లకు పోయి ఎంతో కాలంగా పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులను అయోమయానికి గురిచేస్తున్నారన్నారు. డీఎస్సీ, గ్రూప్ 2 పరీక్షల మధ్యలో సమయం ఇవ్వకుండా నిర్ణయించడంతో మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె మధుకృష్ణ, నాయకులు రత్నం శ్రీకాంత్, సుక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

## బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలి : సీపీఎం


ధ్వంసమైన బీటీ రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

రామన్నపేట (వలిగొండ), జూలై 9 : మండలంలోని వెల్వర్తి - అరూరు గ్రామాల మధ్య ధ్వంసమైన బీటీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. సీపీఎం పోరుబాటలో భాగంగా వెల్వర్తి గ్రామంలో మంగళవారం సమస్యలపై సర్వే నిర్వహించి మాట్లాడారు. అరూరు - వెల్వర్తి గ్రామాల మధ్య నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు, రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తుర్కపల్లి ముత్యాలు, కల్యాకి ముత్యాలు, వాసు, కిష్టయ్య, పాపయ్య, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.

## లక్ష్మీతండాలో ఘనంగా శీత్లా భవాని వేడుకలు


లక్ష్మీతండాలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

గుండాల, జూలై 9 : మండలంలోని కొమ్మాయిపల్లి గ్రామ పరిధి లక్ష్మీతండాలో మంగళవారం గిరిజనులు శీత్లా భవాని పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా భవాని అమ్మవారి గుడి వద్ద తండా వాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురువాలని, వ్యవసాయం, పాడి పశువులు బాగుండాలని వేడుకున్నారు. తండా వాసులకు ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శీత్లా భవాని పండుగ కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బూడిద కృష్ణ, పాల సంఘం చైర్మన్ విక్రమ్, మాజీ ఉప సర్పంచ్ పరశురాములు, నాయకులు రామస్వామి, రాములు, ఉప్పలయ్య, కృష్ణ, తండావాసులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్టలో క్షేత్రపాలకుడికి నాగావళి దళార్చన


ఆలయంలో కుటుంబ సభ్యులతో జిల్లా సీనియర్ న్యాయమూర్తి మాధవీలత

యాదగిరిగుట్ట, జూలై 9 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి ప్రధానాలయం క్యూ కాంప్లెక్స్‌తోపాటు శివాలయం చెంతన గల క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి నాగావళి దళార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. నాగవళి దళాలతో అర్చన చేపట్టి లలితాపారాయణం చేశారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడ పప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామివారి సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరు కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 7వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.19,91,286 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ నెల 14న దేవస్థానం ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఇందులో భాగంగా గిరి ప్రదక్షిణ రోడ్డులో భారీ ఎత్తున మొక్కలు నాటనున్నట్లు ఆయన వెల్లడించారు. కాగా, కొండపైన బస్టాండ్ వద్ద సులభ్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో నిర్మించిన 10 మరుగుదొడ్లు బుధవారం అందుబాటులోకి రానున్నాయి.

### స్వామివారిని దర్శించుకున్న సీనియర్ న్యాయమూర్తి మాధవీలత

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని జిల్లా సీనియర్ న్యాయమూర్తి మాధవీలత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం స్వామివారి కొండకు చేరుకున్న న్యాయమూర్తి స్వయంభూ పంచ నారసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ సంప్రదాయరీతిలో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదం అందజేశారు.

## ఇసుక దందాపై బహిరంగ చర్చకు సిద్ధమా?

• కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సవాల్


సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమేశ్

మోత్కూరు, జూలై 9 : తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఇసుక దందా, మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్‌లో అవినీతి ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు సిద్ధమా? అని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ సవాల్ విసిరారు. పట్టణంలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో దోసెడు ఇసుకను పోనివ్వనని శపథం చేసిన ఎమ్మెల్యే మందుల సామేల్ కనుసన్నల్లోనే ప్రస్తుతం నియోజకవర్గంలో ఇసుక మాఫియా కొనసాగుతుందన్నారు. తన ఇద్దరు కుమారులకు లారీలను కొనిచ్చి దందాను సాగిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు అశోక్‌రెడ్డి మోత్కూరు సహకార సంఘంలో చైర్మన్లుగా పనిచేసిన కాలంలో సంఘంలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న ప్రస్తుత చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు నిరూపణ చేసేందుకు బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. రాజకీయంగా ఎదుర్కోలేక సహకార సంఘం డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లను కొనుగోలు చేసి పదవులను దక్కించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. తుంగతుర్తి నియోజకవర్గాన్ని, మోత్కూరు ఎఫ్ఎస్‌సీఎస్‌ను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన ఘనత మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై అసత్య ఆరోపణలు మానుకొని కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రాంపాక నాగయ్య, బీఆర్ఎస్ మున్సిపాలిటీ కార్యదర్శి గజ్జి మల్లేశ్, నాయకులు తిరుమలేశ్, అష్రఫ్ జానీ, వెంకన్న, మత్స్యగిరి, శ్రీనివాస్, రమేశ్, శివ, యాకురాజ్ పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



తుర్కపల్లి, జూలై 9 : మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ షకియొద్దీన్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన డొనికెల రాజయ్య (55)ది నిరుపేద కుటుంబం. అతనికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గ్రామంలో తనకున్న ఎకరం 20 గుంటల భూమితోపాటు మరో 10 ఎకరాలు పాలుకు తీసుకొని వరి సాగు చేస్తున్నాడు. పంట దిగుబడి సరిగ్గా రాక, తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. దానికితోడు ఇటీవల అప్పు చేసి కూతురు పెండ్లి చేశాడు. ఈ క్రమంలో అప్పులు మరింత ఎక్కువ కావడంతో రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో అప్పుల బాధతో మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటికి వెళ్లిన భార్య లక్ష్మి వచ్చి చూసేసరికి మృతిచెంది ఉన్నాడు. రాజయ్య కొడుకు మధు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా దవాఖానకు తరలించారు.

## పాము కాటుతో వ్యక్తి మృతి

రామన్నపేట (వలిగొండ), జూలై 9 : పాము కాటుకు గురై దవాఖానలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాతాళ్లగూడెం గ్రామానికి చెందిన ఉద్దగిరి ఎల్లయ్య (60) సోమవారం మధ్యాహ్నం తన వ్యవసాయ భూమిలో గడ్డి కోసేందుకు వెళ్లగా పాము కరిచింది. చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

## భువనగిరిలో బైక్ చోరీ

భువనగిరి అర్బన్, జూలై 9 : పట్టణంలోని కిసాన్‌నగర్‌లో మంగళవారం బైక్ చోరీ జరిగింది. కిసాన్‌నగర్‌కు చెందిన జి.సాయిప్రశాంత్ మున్సిపల్ ప్లానర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు పాత రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలోని ఆఫీస్‌కు వెళ్లి తన బైక్‌ను పార్క్ చేశారు. మధ్యాహ్నం 2గంటలకు ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లేందుకు పార్కింగ్ దగ్గరికి వచ్చి చూడగా బైక్ కన్పించలేదు. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## శునకానికి అంత్యక్రియలు

రాజాపేట, జూలై 9 : మండలంలోని పుట్టెగూడెం గ్రామానికి చెందిన భూక్యా రేక్యా 15 నెలల కిందట హైదరాబాద్ నుంచి తెచ్చుకొని పెంచుకున్న కుక్క పిల్ల మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్న కుక్క మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పెంపుడు కుక్కను కుటుంబ సభ్యుడిలా భావించి సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది.

## ఇందిరమ్మ కాలనీలో వసతులు కల్పించండి : సీపీఎం

బీబీనగర్, జూలై 9 : మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ అన్నారు. ప్రజా సమస్యలపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో 20 సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలు నివాసముంటున్నాయని, కాలనీలో సరైన వీధిలైట్లు, డ్రైనేజీ, సీసీ రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వానకాలంలో దోమలు, తేళ్లు, పాములతో కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కాలనీలో అంగన్‌వాడీ సెంటర్, రేషన్ డీలర్ షాపు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండారు శ్రీరాములు, కాలనీవాసులు ఎల్లమ్మ, కొమురయ్య పాల్గొన్నారు.

## సబ్సిడీ గొర్రెల పంపిణీ చేపట్టాలి

• గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నర్సింహ


సమావేశంలో మాట్లాడుతున్న బండారు నర్సింహ

చౌటుప్పల్, జూలై 9 : కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి నెలలు గడుస్తున్నా గొర్రెల పంపిణీ చేపట్టడం లేదని, లబ్ధిదారులకు వెంటనే సబ్సిడీ గొర్రెలు ఇవ్వాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బండారు నర్సింహ కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్సిడీ గొర్రెల పంపిణీలో అవినీతి జరిగిందనే సాకుతో ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపివేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. గొర్రెల చోరీలు, కుక్కల దాడుల్లో పెంపకందారులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. పశు వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కొండె శ్రీశైలం, భీమనగోని బాలరాజు, జంగయ్య, ఐలయ్య, యాదయ్య, బీరప్ప, చలమంద రాజు, మల్లయ్య, నర్సింహ, రాములు, వెంకటేశం పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

బొమ్మలరామారం, జూలై 9 : ప్రజా సమస్యలను పరిష్కరించకపోతే తాసీల్దార్ కార్యాలయం ముట్టడిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి పాండు అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం, నాయకులు బ్రహ్మచారి, లక్ష్మయ్య, నరేశ్, పున్నమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి : సీఐటీయూ


భువనగిరి కలెక్టరేట్ : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను పరిష్కరించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు, ఆయాలు చేపట్టిన నిరాహార దీక్షలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్, వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకుమారి, నాయకులు ఎల్లమ్మ, ఉపేంద్ర, సునీత, లక్ష్మీబాయి, స్వరూప పాల్గొన్నారు.

## 'పల్లెర్ల బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలి'

ఆత్మకూరు(ఎం), జూలై 9 : గుంతలమయంగా మారిన పల్లెర్ల నుంచి వేములకొండ స్టేజీ వరకు బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరుబాట కార్యక్రమంలో భాగంగా ఈ నిరసన చేపట్టినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రచ్చ గోవర్ధన్, స్వామి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, చంద్రయ్య, మహేశ్, ఐలయ్య పాల్గొన్నారు.



పల్లెర్లలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

## భూ పట్టా రద్దు చేయాలని నిరసన

రాజాపేట, జూలై 9 : ఇండ్ల స్థలాల భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని మండలంలోని బేగంపేట గ్రామస్తులు మంగళవారం తాసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వే నెంబర్ 168లోని 3.38 ఎకరాల భూమిని 1992 సంవత్సరంలో ఇండ్ల స్థలాల కోసం కొనుగోలు చేసి కొంత భూమిలో ఇండ్ల నిర్మాణం చేపట్టామన్నారు. మిగిలిన భూమిని కొంతమంది అక్రమంగా పట్టా చేసుకున్నారని తెలిపారు. ఇండ్ల పట్టాల కోసం కొనుగోలు చేసిన భూమిని ఇప్పించాలని కోరారు. అనంతరం తాసీల్దార్ దామోదర్‌కు వినతి పత్రం అందజేశారు.


ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న షియా ముస్లిం పెద్దలు

## పీర్ల పండుగకు వసతులు కల్పించాలి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి షియా ముస్లిం పెద్దల వినతి

భువనగిరి అర్బన్, జూలై 9 : పట్టణంలో ఈ నెల 17న జరుపుకొనే పీర్ల పండుగ (మొహర్రం) సందర్భంగా పీర్ల కొట్టాల వద్ద ఏర్పాట్లు చేయించాలని, వీధి దీపాలు, మంచినీరు, శానిటేషన్ ఇతర మౌళిక వసతులు కల్పించాలని షియా ముస్లిం జిల్లా అధ్యక్షుడు రజా హుస్సేన్ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజా హుస్సేన్ మాట్లాడుతూ ఈ నెల 8నుంచి మొహర్రం నెల ప్రారంభమైందని, పట్టణంలోని 21వ వార్డులో గల బీబీ కా అలావా పీర్ల కొట్టం వద్ద రోడ్డు గుంతల మయంగా మారిందని, పూడ్చివేయించాలని అన్నారు. కర్బలా మైదాన్‌లో మట్టితో లెవల్ చేయించాలని, హైదరాబాద్ చౌరస్తా నుంచి దర్గాకమాన్ వరకు హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఎస్‌కే షానూర్ పాషా, షియా ముస్లిం కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్బ్ హుస్సేన్, మత పెద్దలు అద్నన్ పాల్గొన్నారు.

**వార్డు అభివృద్ధికి నిధులు కేటాయించాలని..**

భూదాన్ పోచంపల్లి : మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కౌన్సిలర్ భోగ భానుమతి మంగళవారం హైదరాబాద్‌లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఆమె వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భారత లవకుమార్ ఉన్నారు.

## సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలి

• సీపీఓ వెంకటేశ్వర్లు


ఆన్‌లైన్‌లో పథకాల నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న సీపీఓ వెంకటేశ్వర్లు

భువనగిరి కలెక్టరేట్, జూలై 9 : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా ముఖ్య ప్రణాళికా అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ గ్యాస్, గృహజ్యోతి పథకాల కోసం లబ్ధిదారులు చేసుకునే దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలన్నారు. ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్‌రావు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

## హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి : ఎంపీడీఓ


ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీఓ నిరంజన్ వలీ

ఆత్మకూరు(ఎం), జూలై 9 : ప్రభుత్వ హాస్టళ్లలో వసతి పొందుతున్న విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంపీడీఓ నిరంజన్ వలీ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, వంట గది, మూత్రశాలలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ పద్మావతి, వసతి గృహం అధికారి ధీరావత్ రాజాలుబాయి ఉన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు

భువనగిరి అర్బన్, జూలై 9 : మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సమావేశం నిర్వహించలేదని, కోడ్ ముగిసి నెల రోజులు గడుస్తుందని, వెంటనే కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని అన్నారు. కౌన్సిల్ సమావేశంలో పొందుపరిచే ఎజెండాలో అన్ని వార్డులకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి వార్డుకు పార్టీలకతీతంగా నిధులు కేటాయించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు ఖజా అజీముద్దీన్, దిడ్డికాడి భగత్, పంగరెక్క స్వామి, నాయకులు అఫ్జల్, చెన్న మహేశ్, కుశంగల రాజు, తుమ్మల పాండు పాల్గొన్నారు.

## వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని నిరసన


కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వీఆర్ఏల సంఘం నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 9 : వీఆర్ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీఆర్ఏల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ వీఆర్ఏల న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. వీఆర్ఏలకు అనుకూలంగా ఉన్న జీఓ 81ని తూ.చా తప్పక అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, బాబా, ధనుంజయ్, ఎల్లయ్య, పాండు, కుమార్, భిక్షపతి, నర్సింహ పాల్గొన్నారు.

## ఇంద్రియాల గ్రామానికి బస్సు సౌకర్యం

భూదాన్ పోచంపల్లి, జూలై 9 : మండలంలోని ఇంద్రియాల గ్రామానికి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. మంగళవారం దిల్‌షుఖ్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాగా.. గ్రామ నాయకులు, ప్రజలు పూజలు చేశారు. రోజూ ఉదయం 9:50 గంటలకు ఇంద్రియాల గ్రామానికి బస్సు వస్తుందని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు తెలిపారు.


ఇంద్రియాల గ్రామంలో ఆర్టీసీ బస్సుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు